www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 18 సెప్టెంబర్ 2023
5
కాకినాడ



ఘనంగా వినాయక చవితి ఏర్పాట్లు

ప్రజాశక్తి - తాళ్లరేవు

గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా నిర్వహించే నవరాత్రి ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. మారుమూల గ్రామాల్లో సైతం యువకులు, చిన్నారులు వినాయక చవితికి పందిర్లు వేశారు. మామిడి తోరణాలు, పలు రకాల పత్రితో పందిళ్లను అలంకరించారు. సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లో వర్తక సంఘం ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలకు ఆకర్షణీయంగా భారీ సెట్టింగ్ ఏర్పాటు చేశారు. తాళ్ళరేవు సంతపేట సెంటర్లో వినాయక చవితి సందర్భంగా చిరు వ్యాపారులు వేసిన దుకాణాల వద్ద ఆదివారం మెయిన్ రోడ్డు ప్రజలతో కిటకిటలాడింది.

పొత్తులతో మారుతున్న ఎత్తులు

- రాజకీయ సమీకరణాల్లో మార్పు
- పోటీకి ఎవరు.. ఎక్కడ..
- నియోజకవర్గాల వారీగా టిడిపి, జనసేన లెక్కలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రానున్న సాధారణ ఎన్నికల్లో టిడిపితో కలిసి పోటీ చేస్తున్నామని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించిన నేపథ్యంలో రెండు పార్టీల మధ్య పొత్తు ఖరారయ్యింది. దీంతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. మరో ఆరు నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రాజకీయం మరింత వేడెక్కుతోంది. ప్రధాన పార్టీల్లో టికెట్ల కోసం ఆశావహులు ఇప్పటి నుంచే పావులు కదుపుతున్నారు. రాష్ట్రంలోనే జనసేనకు బలమైన జిల్లాగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఉంటుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఓట్ల సంఖ్య దాన్ని స్పష్టం చేస్తోందని అంటున్నారు.

పొత్తులు, ఎత్తులు

రాజకీయ పొత్తులు, ఎత్తులు విషయంలో టిడిపి, జనసేన పార్టీ ఇప్పుడు సుదీర్ఘంగా చర్చించుకుంటున్నాయి. 2014 ఎన్నికల్లో కలిసి బరిలో దిగిన పార్టీలు మరోసారి ఎన్నికల బరిలోకి ఉమ్మడిగా అడుగుపెట్టడం అనివార్యమయింది. అయితే అప్పట్లో జనసేన పోటీ చేయకుండా టిడిపికి మద్దతు ఇచ్చింది. దీంతో బిజెపి, జనసేన, టిడిపి కూటమి జిల్లాలో నాటి 19 సీట్లకుగాను 15 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసింది. 2019 ఎన్నికల్లో మాత్రం విడివిడిగా పోటీ చేసి టిడిపి కేవలం నాలుగు సీట్లకు పరిమితం కాగా జనసేన రాజోలు స్థానంలో మాత్రం గెలిచింది. గత ఎన్నికల్లో జిల్లాలో జనసేన 14 శాతం ఓట్లు సాధించింది. టిడిపికి పెద్దాపురం, మండపేట, రాజమహేంద్రవరం రూరల్, అర్బన్ స్థానాల్లో విజయంతో పాటుగా మిగిలిన 15 స్థానాల్లోనూ రెండో స్థానం దక్కింది. 34 శాతం వరకు ఆ పార్టీకి ఓట్లు దక్కాయి. దాదాపు 49 శాతం ఓట్లు సాధించిన వైసిపి తిరుగులేని ఆదిత్యాన్ని ప్రదర్శించి జిల్లాలో తన జెండా ఎగురవేసింది.

జనసేన ఎక్కువ సీట్లు ఆశించే అవకాశం

రాష్ట్రంలోనే జనసేనకి ఎక్కువ ఓట్లు వచ్చిన ఉమ్మడి జిల్లా కావడం, గెలిచిన ఏకైక సీటు కూడా ఇక్కడే ఉండడంతో జనసేన ఎక్కువ సీట్లను ఇక్కడే ఆశించే అవకాశం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో అటు టిడిపి, ఇటు జనసేన నేతలు అప్రమత్తమయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో తమ ఉనికిని చాటుకునే యత్నాలు మొదలు పెట్టారు. ఎవరికి వారే ఆ సీటు తమదేననే ధీమాతో సాగుతున్నారు. 2019 ఎన్నికల్లో లభించిన ఓట్లు ఆధారంగా ఎవరు ఎక్కడ బలంగా ఉంటే ఆయా స్థానాల్లో పోటీ చేసే అవకాశం ఉంటుందని టిడిపి నేతలు ఆశిస్తున్నారు. కానీ మారిన రాజకీయ పరిణామాల్లో ప్రస్తుతం మూడు జిల్లాల్లో జనసేనదే అధిక్యమని ఆ పార్టీ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. రాజోలు నుంచి గెలిచిన ఎంఎల్ఎ రాపాక వరప్రసాద్ పార్టీ ఫిరాయించారు. కానీ అక్కడ జనసేనకు బలం ఇంకా ఎక్కువగా ఉందని జెఎస్‌పి భావిస్తోంది. ఇలా పలుచోట్ల యువతలో మంచి ఫాలోయింగ్ ఉండడం, బలమైన సామాజికవర్గంలో మెజారిటీ ఓటర్లు అండగా ఉండడం, రాజకీయంగా అధికార పార్టీతో ఢీ అంటే ఢీ అనేలా వ్యవహరిస్తుండడం వంటి కారణాల రీత్యా తమకే మెజార్టీ సీట్లు దక్కుతాయని జనసేన నాయకుల్లో కనిపిస్తోంది.



టికెట్ల కోసం కుస్తీ పట్లు తప్పవా..?

మూడు జిల్లాల పరిధిలో రాజోలుతోపాటు అమలాపురం, ముమ్మిడివరం, కాకినాడ రూరల్, పిఠాపురం, జగ్గంపేట, తుని, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, పెద్దాపురం వంటి అసెంబ్లీ స్థానాలను జనసేన ఆశించే అవకాశం కనిపిస్తుంది. కానీ తెలుగుదేశం పార్టీ కూడా వీటిలో అనేక స్థానాల్లో బలమైన నేతలు ఉన్నారు. ప్రధానంగా రాజమండ్రి రూరల్, పెద్దాపురం వంటి ప్రాంతాల్లో సిట్టింగ్ ఎంఎల్ఎలు ఉన్నారు. ఇప్పటికే సిట్టింగ్ ఎంఎల్ఎలకు ఆయా స్థానాలను కేటాయిస్తున్నట్టు టిడిపి అధినేత కూడా ప్రకటించారు. మెట్ట ప్రాంతంలో బలమైన నాయకుడు, టిడిపి సీనియర్ నేత జ్యోతుల నెహ్రూ ఉండగా జగ్గంపేట సీటుని జనసేనకు కేటాయించే అవకాశం లేదు. మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్ వర్మ కచ్చితంగా పిఠాపురం నుంచే పోటీ చేస్తానని గతంలోనే స్పష్టం చేసారు. కానీ బలమైన కాపు సామాజికవర్గం ఉన్న నియోజకవర్గం కాబట్టి జనసేన ఈ టిక్కెట్ ఆశిస్తోంది. పొత్తులో జనసేనకు కేటాయిస్తే స్వాతంత్ర్య అభ్యర్థిగా పోటీలో ఉంవర్మ తన అనుచరులతో ఇప్పటికే చర్చించారు. దీంతో ఇలాంటి సీట్లు కొన్నింటిపై ఇరు పార్టీల మధ్య సఖ్యత ఎలా కుదురుతుందనేది చర్చనీయాంశంగా మారింది. కొన్ని స్థానాల్లో రాజీ పడినప్పటికీ ఇలాంటి కీలక నియోజకవర్గాల విషయంలో సిగపాట్లు తప్పే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో కిందస్థాయి నేతలను సర్దుబాటు చేయడం టిడిపి, జనసేన పార్టీలకు కత్తిమీద సాముగా మారనుంది. ఇదే సందర్భంలో ఓట్ల బదిలీ అంశం కూడా కీలకంగా మారనుంది.



సమావేశంలో మాట్లాడుతున్న చక్రవర్తి

యుటిఎఫ్ జాతాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల ప్రచార జాతాను విజయవంతం చేయాలని జిల్లా కార్యవర్గం పిలుపునిచ్చింది. ఆదివారం యుటిఎఫ్ హోమ్‌లో నిర్వహించిన జిల్లా విస్తత కార్యవర్గ సమావేశంలో కాకినాడ జిల్లా అధ్యక్షుడు కెవి.వి.నాగేశ్వరరావు మాట్లాడారు. యుటిఎఫ్ 1974లో స్థాపించారని, రాబోయే సంవత్సరం యుటిఎఫ్ స్వర్ణోత్సవాల నేపథ్యంలో సెప్టెంబర్ 24 నుంచి జరిగే ప్రచార జాతాను అందరూ ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. జిల్లా ప్రధానకార్యదర్శి తోటకూర రవి చక్రవర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా వేధిస్తోందని, చిన్న చిన్న కారణాలను సాకుగా చూపించి అక్రమంగా సస్పెండ్ చేస్తున్నారని చెప్పారు. అక్రమ సస్పెన్షన్‌లు రద్దు చేసి వెంటనే జీతాలు చెల్లించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.అన్నరాము మాట్లాడుతూ ఈ ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేశామని, జిపిఎస్ ఆర్డినెన్స్ తీసుకువస్తున్నామని కొత్త నాటకానికి తెర లేపిందని, జిపిఎస్‌కు ఏమాత్రం ఒప్పుకునేది లేదని అయన స్పష్టం చేశారు. పాత పెన్షన్ ప్రవేశ పెట్టడం మినహా ఏ ప్రతిపాదన తమకు అంగీకారం కాదన్నారు. ఈ సమావేశంలో నాయకులు జి.ప్రభాకరవర్మ, పివిఎన్.గనేశ్వర, మహిళా అధ్యక్షురాలు బి.నాగమణి, ఎంవి.సాయిరాం, సిహెచ్.సూరిబాబు, టి.సీతారామయ్య, వి.మహేష్, బి.నూకరాజు, టి.సత్తిబాబు, జి.నాగరాజు, వివి.రమణ, ఎన్.గోవిందరాజులు, పి.గిరిధర్ గోపాలరావు, పివి.సత్యనారాయణ, ఎ.సీతారామరాజు, ఎంఎస్‌సి.మూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

మాధవపట్నం జమునా నగర్ కాలనీలో అంగర లక్ష్మీకాంతం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల మందిరంలో ఆదివారం విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణా తరగతులు నిర్వహించారు. బాలమందిరం కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. చెస్, వైకుంఠపాళి వంటి ఇన్‌డోర్ గేమ్స్ ఆడారు. కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించారు. పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు నిర్వహించారు. బాలల కోసం బాలలే రూపకల్పన చేస్తున్న చిట్టి ఊహలు పత్రిక కోసం ఎడిటోరియల్ టీమ్ కార్యశాల నిర్వహించారు. హేమంత్, విస్సు మెంటార్స్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి బాలమందిరం వ్యవస్థాపకులు అంగర గోపాలకష్ణ అధ్యక్షత వహించారు. బాల మందిరం విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో విద్యార్థులు

పోలింగ్ స్టేషన్లను సందర్శించిన కమిషనర్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు ఆదివారం నగరంలోని మార్పులు చేయాల్సిన పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. గత ఎన్నికల్లో కొన్ని పోలింగ్‌స్టేషన్లు శిథిలావస్థకు చేరడం వంటి కారణాల దృష్ట్యా పలుచోట్ల కొత్త స్థానాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. ఆ మేరకు గాంధీనగర్, పోర్టు ఏరియా, గాంధీ సెంటినరీ, జగన్నాథపురం శివాలయం ప్రాంతాల్లోని ప్రతిపాదిత పోలింగ్ స్టేషన్లను కమిషనర్ పరిశీలించారు. అక్కడ ఉన్న సదుపాయలు, సౌకర్యాల కల్పనపై ఆరా తీశారు. అధికారులు, సిబ్బందికి ఆయన సూచనలు ఇచ్చారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, తహశీల్దార్ సీతాపతిరావు, ఎలక్షన్ డిటి మురళీకృష్ణ, రాంబాబు, డిసిపి నాగశాస్త్రులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలతో కాలుష్యం నివారణ

ప్రజాశక్తి-జగ్గంపేట, సామర్లకోట

కాలుష్యాన్ని నివారించడం కోసం మట్టి వినాయక ప్రతిమలే వాడాలని శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ జి.శ్రీను అన్నారు. స్కూల్లో ప్రతి విద్యార్థి మట్టి వినాయక ప్రతిమలు తయారు చేయించి స్కూల్లో ప్రదర్శన చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని దష్టిలో పెట్టుకొని కాలుష్యాన్ని నివారిస్తూ వినాయక ప్రతిమలను మట్టితో చేయడం వల్ల కలిగే లాభాలను గత నాలుగు రోజులుగా విద్యార్థులకు అవగాహన కలిగించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ నాగేంద్రబాబు, ఎఒ సత్యనారాయణ, సి.బ్యాచ్ నిర్వహణ అధికారి మూర్తి, కో ఆర్డినేటర్ పట్నాయక్ పాల్గొన్నారు. సామర్లకోట రూరల్ ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి పర్యావరణాన్ని పరిరక్షించడానికి తమ వంతు కృషి చేయాలని పెద్దాపురం ఆర్‌డిఒ సీతారామారావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక స్టేషన్ సెంటర్లోని బసిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం శ్రీ శారదా రామకష్ణ, సీనియర్ జర్నలిస్ట్ అడపా వెంకట్రావు 15 ఏళ్లుగా మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమం చేయడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు, శ్రీ తోటకూర గంగాధర్, తోటకూర సాయి రామకృష్ణ, కౌన్సిలర్ స్వయంవరపు వీరభద్రరావు, టివివి.సత్యనారాయణ, జి.ప్రకాశరావు, పున్నం నాగేశ్వరావు, టి.సాయి వంశీ పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న మహేష్

రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ

ప్రజాశక్తి- రౌతులపూడి

పారుపాకలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయబోతున్న గాడి మహేష్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహిరంచారు. మండల కేంద్రమైన రౌతులపూడిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రౌతులపూడి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడి నూకరాజు, పలువురు కార్యకర్తలు తదితరులు ఉన్నారు

కొనసాగిన టిడిపి నిరసన దీక్షలు

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌కు నిరసనగా పార్టీ ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు ఆదివారం కొనసాగాయి.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ రూరల్ మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఇంద్రపాలెం జెడ్ బ్రిడ్జి సెంటర్ నుండి ఇంద్రపాలెం గ్రామం వీధుల్లో కాగడాలతో ర్యాలీ చేపట్టారు. మందలపు రవి, కటకంశెట్టి ప్రభాకర్, మాకినీడి భాస్కర్, చొల్లంగి వేణుగోపాల్, సరిదే నాగ హరినాథ్, దాయన రాంప్రసాద్, కర్రి వెంకటరాజు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** తెలంగాణ విడిపోయి రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయిన సమయంలో ఎపి భవిష్యత్తు కోసం చంద్రబాబు పరితపించారని టిడిపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. ఏలేశ్వరంలో ప్రత్తిపాడు నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరుపుల సత్య ప్రభతో కలిసి నిరసన దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణ స్వామి, పెంద్ర శ్రీను, కోణాల వెంకటరమణ, ఎండగుండి నాగబాబు, నాయకులు జ్యోతుల పెదబాబు, సూది బూరయ్య, పతివాడ కృష్ణ, కోరాడ కృష్ణమోహన్, కిలారి రామచంద్రరావు, బెల్లాని శ్రీను, వైబోగుల సుబ్బారావు ఉన్నారు. **కరప** మాజీ జెడ్‌పిటిసి నులుకుర్తి వెంకటేశ్వరరావు, పేరాబత్తుల రాజశేఖర్ స్వర్ణ థియేటర్ వద్ద సామూహిక నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ దీక్షల్లో వాసిరెడ్డి ఏసుదాసు, దేవు వెంకన్న, కొండ వినాయక్, కంచుమర్తి లావణ్య, ఆనంద చౌదరి, పి.లోవరాజు, భవాని, వెంకటరత్నం చౌదరి, జి.భాస్కరరావు, కె.ధర్మారావు పాల్గొన్నారు. **పెద్దాపురం** టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో రాజా సూరిబాబు రాజు, రంధి సత్యనారాయణ, తూతిక రాజు, కొత్తిం వెంకట శ్రీనివాసరావు, కురుపూరి రాజు, కాకినాడ రామారావు, చాగంటి గోపాలకృష్ణ, బొడ్డు ఉదయ్, నూనె రామారావు, ఎలిశెట్టి నాని, కందుల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు. **సామర్లకోట రూరల్** హుస్సేన్‌పురంలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. చల్లా బుజ్జి ఆధ్వర్యంలో సుమారు 1000 మంది పోస్టు చేయనున్నట్లు వారు చెప్పారు. పుప్పాల రాజు, కోట సురేష్ కుమార్, కె.శ్రీను, పుప్పాల రామచంద్రరావు, పలివెల చంద్రశేఖర్, పైణ్ణి లక్ష్మణరావు, బుంగా బాలరాజు, వాకపల్లి లోవరాజు, తలారి శ్రీను, పుప్పాల శివ, కలవల చంద్రరావు, మల్లిపూడి వీర్రాజు, గుడాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



కాకినాడ రూరల్‌లో..



ఏలేశ్వరంలో..



కరపలో..

పలుచోట్ల ఘనంగా విశ్వకర్మ జయంతి

ప్రజాశక్తి - పెద్దాపురం, గండేపల్లి

కులమతాలకతీతంగా ప్రజలందరూ సామరస్యంతో ముందుకు సాగాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక శ్రీ కామాక్షి ఏకాంబరేశ్వర శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన విశ్వకర్మ జయంతి ఉత్సవాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం దేవస్థానం కమిటీ అధ్యక్షులు తాళాబత్తుల సాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కులమతాలకతీతంగా విశ్వకర్మ జయంతిని జరపడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మున్సిపల్ కౌన్సిలర్లు కట్టా రాజబాబు, విడదాసరి రాజా, కమిటీ సభ్యులు చిట్టిమోజు శ్రీను, వేముల అర్జునరావు, చిట్టిమోజు లక్ష్మీనారాయణ, బంగారు సత్యనారాయణ, చిప్పాడ బుజ్జి, ధవళేశ్వరపు సత్తిబాబు, చింతా శ్రీనివాస్ పాల్గొన్నారు. గండేపల్లి మండల కేంద్రంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద గోలి రత్నం ఆధ్వర్యంలో పలువురు పెద్ద ఎత్తున పూజలు చేశారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలవచర్ల పరిపూర్ణాచార్యులు, గౌరీపట్నం సూర్యనారాయణ, తణుకు చెన్నాచార్యులు, వీరమల్ల బంగారయ్య, వీరమల్ల సూరిబాబు, పసలపూడి వెంకట్రావు, గంద్రాల బాపిరాజు, ఆదిన బాబురావు, కర్రి శ్రీనివాస్, వీరమల్ల శివయ్య, గోగు సూర్యనారాయణ పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి మహిళకూ అవగాహన అవసరం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

సమాజంలో ప్రతి మహిళా తమ హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యాయవాది అవసరాల దేవి పిలుపునిచ్చారు. స్థానిక 7వ సచివాలయంలో ఆదివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో దేవి మాట్లాడారు. మహిళా రక్షణకు ఉన్న ప్రత్యేక చట్టాలను వివరించారు. నిరక్షరాస్య మహిళలకు తోటి మహిళలు రాయడం చదవడం నేర్పించడం ద్వారా సమాజంలో కొంతవరకైనా మార్పు వస్తుందన్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి మహిళా కనీస విద్య నేర్చుకోవాలని ఆమె కోరారు. ప్రతి కుటుంబంలోనూ అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలను కూడా చదివించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి, సచివాలయ మహిళా సిబ్బంది ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -కరప

కరపలో సానా సతీష్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమయ్యింది. ఆదివారం స్థానిక జడ్పీ హైస్కూల్ మైదానంలో మాజీ జెడ్‌పిటిసి నురుకుర్తి వెంకటేశ్వరరావు పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. వినాయక చవితి పండుగ ఆనందంతో పాటు క్రికెట్ కేరింతలతో గ్రామీణ వాతావరణం కళకళలాడాలనే తలంపుతో జిల్లావ్యాప్తంగా క్రికెట్ పోటీలను సానా సతీష్ బాబు ఫౌండేషన్ నిర్వహించ తలపెట్టింది. ఈ కార్యక్రమంలో ఆనంద్ న్యూటన్, మురళి, సుందర శ్రీనివాస్, ముమ్మిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


వైసిపి మండల అధ్యక్షునిగా జిగిరెడ్డి శ్రీను

ప్రజాశక్తి -రౌతులపూడి



వైసిపి మండల అధ్యక్షునిగా జిగిరెడ్డి శ్రీనును నియమిస్తూ వైసిపి అధిష్టానం నుంచి ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా జిగిరెడ్డి శ్రీను ఎంఎల్ఎ పర్వత శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు, జిగిరెడ్డి శ్రీనును, జెడ్‌పిటిసి గొల్లు లక్ష్మణమూర్తి, డిసిసిబి డైరెక్టర్ పులి మధు, వివిధ గ్రామాల సర్పంచులు, వైసిపి నాయకులు అభినందించారు.

కార్టూ'నిజం'





పాండవుల మెట్టపై పరిశుభ్రతాపనులు

పాండవుల మెట్టపై పరిశుభ్రత పనులు

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇండియన్ స్వచ్ఛత లీగ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం చారిత్రక ప్రదేశమైన పాండవుల మెట్టపై పరిశుభ్రత పనులు చేపట్టారు. సానిటరీ ఇన్స్పెక్టర్ దావీదు రాజు ఆధ్వర్యంలో సానిటరీ మేస్త్రీల పర్యవేక్షణలో సిబ్బంది పరిశుభ్రత పనులు నిర్వహించారు. స్వచ్ఛత పరిశుభ్రత పై ర్యాలీలు నిర్వహించారు. తూర్పుపాకలు గ్రామంలో శుభ్రత, పరిశుభ్రత పనులను ప్రారంభించారు. ఈ పనుల్లో భాగంగా రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వరకు పిచ్చి మొక్కలు లేకుండా పరిశుభ్రం చేశారు. డ్రైనేజీలను శుభ్రం చేసి చెత్తను తొలగించారు. ఈ పనులను పంచాయతీ కార్యదర్శి ఎస్.ధర్మరాజు, వైసిపి ఇన్చార్జి పడాల వీర రాఘవులు పర్యవేక్షించారు.

శెట్టిబలిజలకు ప్రభుత్వం ప్రాధాన్యత

ప్రజాశక్తి - కాకినాడ



సభలో మాట్లాడుతున్న మంత్రి వేణు

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం శెట్టిబలిజకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కాకినాడ సూర్యకళ మందిరంలో నిర్వహించిన శెట్టిబలిజ ఆత్మీయ సమ్మేళన సభలో మంత్రి వేణు మాట్లాడుతూ తనను మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి గుర్తించి జెడ్‌పి చైర్మన్ పదవితో పాటు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షునిగా నియమించారని, తన నియామకంలో ఎంఎల్ఎ ద్వారంపూడి ప్రధాన పాత్రను పోషించారన్నారు. జనసేన- టిడిపి ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే రాజకీయంగా శెట్టిబలిజలు నష్టపోయే అవకాశం ఉందని ఎంఎల్ఎ ద్వారంపూడి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, వాసంశెట్టి రాజేశ్వరరావు, మత్రిపూడి రమణ, వాసంశెట్టి సత్య, కుందూరు అప్పలనాయుడు, గీసాల భాస్కర్, పితాని సోమన్న, రాయుడు మురళి, బొందల నూకరాజు, కర్రి బాబ్జి, వాసంశెట్టి భీమరాజు, ఎల్లబోయిన చిన్న, నురుకుర్తి సూర్యప్రకాష్, దొడ్డి వీరేంద్ర, వనుం సుబ్బారావు, బొక్క బుజ్జి, పైడి రాజు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ నాయుడు

కొత్తపల్లి ఎస్ఐగా స్వామి నాయుడు

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

యు.కొత్తపల్లి ఎస్ఐగా పివిసి స్వామి నాయుడు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ రామలింగేశ్వరరావు తుని టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ స్వామి నాయుడు మాట్లాడుతూ చట్ట వ్యతిరేక పనులకు ఎవరైనా పాల్పడితే చర్యలు తప్పవని తెలిపారు. మండల ప్రజలతో మమేకమై సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరాలపై దాడి పదిమంది అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలోని దంగేరు శివారు పంట పొలాల వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.10,250 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జానీ భాష తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇలా చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉప్పలగుప్తం ఎస్.కొత్తపల్లి పంచాయతీ రాఘవులపేటలో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.2,900 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి. వెంకటేశ్వరరావు తెలిపారు.

కల్వర్టును ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రమాదవశాత్తు నేషనల్ హైవేలో ఉన్న కాలువ కల్వర్టును ద్విచక్రవాహనంపై వెళ్తూ ఢీకొట్టిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు... పోలవరం మండలంలోని ఎల్ఎన్‌డి పేటకు చెందిన కట్టవ సత్యనారాయణ(60) దేవరపల్లి మండలం చిక్కాల గ్రామంలో ఉన్న తన కూతురు ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం 8.30 గంటల సమయంలో తిరిగి తన స్వగ్రామానికి వెళ్తూ గోపాలపురం శివారు పొగాకు బోర్డు సమీపంలో తాడిపూడి కాలువ సంబంధించి నేషనల్ హైవేపై కల్వర్టును ద్విచక్ర వాహనంపై వెళ్తూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సత్యనారాయణ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి తరలించినట్లు తెలిపారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి

పశుసంవర్ధక శాఖ జెడి వెంకటరావు





ప్రజాశక్తి- అమలాపురం

జిల్లాలో పశు సంపదను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, జిల్లాలో పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని, రైతు భరోసా కేంద్రాల ద్వారా పశు వైద్య సేవల్ని అందిస్తున్నామని అంబేద్కర్ కోనసీమ జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కె.వెంకటరావు తెలిపారు. పశువులకు బీమా, వ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత, ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ఆయన వివరించారు.

పాడి రైతుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోంది. ఇప్పటికే గ్రామాల్లోని పశువైద్య సహాయకులను నియమించడంతో వారు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఇప్పటివరకూ మూగజీవాలు అనారోగ్యానికి గురైతే రైతులు అందుబాటులో ఉన్న పశు వైద్య సిబ్బందిని సంప్రదించి మందులు వేసేవారు. దీంతో పశువులకు సరైన సమయంలో వైద్యం అందుబాటులోకి వచ్చింది.

పశువుల ఆరోగ్యానికి ఎటువంటి భరోసా కల్పిస్తున్నారు.

పశువుకు సంక్రమించిన వ్యాధి ఏమిటో కచ్చితంగా తెలిసేది కాదు. వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల (లేబొరేటరీ) అందుబాటులో లేకపోవడంతో పశువులు చనిపోయి రైతులు నష్టపోయేవారు. లేబరటరీలు ఉంటే పశువులను కాపాడవచ్చని గ్రహించిన సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. తద్వారా మూగజీవాల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోంది.

జిల్లా కేంద్రంలో ల్యాబ్ ఎంతవరకు పనిచేస్తుంది..?

జిల్లా కేంద్రంలో రీజినల్ ల్యాబ్ భవన నిర్మాణం పూర్తయింది. త్వరలోనే ఇక్కడ ల్యాబ్ ప్రారంభమవుతుంది. ఇతర పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పశువులు అనారోగ్యానికి గురైతే సమీపంలోని పశు వైద్యశాలల సిబ్బంది వైద్యం చేస్తున్నారు. కింది పశు వైద్యశాలల్లో ప్రయోగశాలలు లేకపోవడంతో పశువులకు ఏ వ్యాధి సోకిందో కచ్చితంగా తెలియడం లేదు. వ్యాధి నిర్ధారణకు జిల్లా కేంద్రంలోని ల్యాబ్‌కు రక్త నమూనాలు పంపిస్తున్నారు. ఆ రిపోర్టులు వచ్చేసరికి వ్యాధి తీవ్రమై పశువులు మరణిస్తున్నాయి. దీంతో పాడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒక వెటర్నల్ లేబొరేటరీని అందుబాటులోకి తీసుకువస్తోంది.

ఎన్ని ల్యాబ్ లు అందుబాటులోకి వస్తున్నాయి.

జిల్లాలో 7 నియోజకవర్గాలు ఉండగా జిల్లా కేంద్రంలో రీజినల్ ల్యాబ్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అమలాపురం సహా జిల్లాలో 7 నియోజకవర్గాల్లో పశువుల వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు ఏర్పాటు చేశారు. ఈ ప్రయోగశాలలో కూడా పశువులకు సంబంధించిన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అన్ని పరీక్షలు ఒకే చోట నిర్వహిస్తారా.

ఈ ప్రయోగశాలల్లో అనారోగ్యానికి గురైన పశువులకు అన్ని రకాలు పరీక్షలు చేస్తారు. ఆ ఫలితాలు వెంటనే రావడం వలన సత్వరమే అవసరమైన వైద్యాన్ని అందిస్తారు. ప్రతి నియోజకవర్గ కేంద్రానికి ఒక ల్యాబ్ టెక్నీషియన్, ల్యాబ్ అటెండర్‌ను నియమించారు. ఇప్పటికే ల్యాబ్ టెక్నీషియన్లు పని చేస్తున్నారు. ఈ ల్యాబ్ లకు భవనాలను ఎపి పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా చేపట్టారు.

పశువధను నిరోధించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి.

జిల్లాలో పశు విక్రయాలు, పశువుల వధ అంశాలపై ప్రభుత్వం 2014 లో ప్రివెన్సెస్ ఆఫ్ క్రూయాలిటీ టు ఏనిమల్ రూల్స్ అనే చట్టాన్ని విడుదల చేసింది. ఈ చట్టం ప్రకారం పశు విక్రయాలను, వధలను నిరోధిస్తాం. 2014 లో అప్పటి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ నీతూ కుమారి హయాంలో కమిటీ ఏర్పడింది. జిల్లా కమిటీలో కలెక్టర్ చైర్మన్‌గా పోలీసు, ట్రాన్స్‌పోర్టు, రెవెన్యూ, పశు సంవర్ధక శాఖ, ఒక ఎన్‌జిఒ, జంతు ప్రేమికులు కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఎక్కడైనా పశు వధ జరిగినట్లు సమాచారం వస్తే ఈ కమిటీ చర్యలు తీసుకుంటుంది. నూతనంగా ఏర్పడిన జిల్లా కాబట్టి కమిటీ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఇప్పటికే ప్రతిపాదన పంపారు.

యానాం వార్తలు

రమాబాయి నగర్ అభివృద్ధి కమిటీ ఎంపిక

ప్రజాశక్తి - యానాం

స్థానిక మెట్టకూరు రమాబాయి నగర్ అభివృద్ధి కమిటి ఎంపికైంది. ఈ నూతన కమిటి అధ్యక్షులుగా ఇసుకపట్ల విశ్వనాథం, ఉపాధ్యక్షులుగా బూలా బాలు, సెక్రటరీగా జిల్లెల్ల చిరంజీవి, జాయింట్ సెక్రటరీగా కమిడి కష్ణ ప్రసాద్ దత్తు, కోశాధికారిగా మట్టపర్తి కష్ణ, గ్రామ పెద్దగా బొమ్మిడి శరత్ బాబు, ప్రత్యేక సలహాదారుడుగా యాళ్ల వెంకట్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులంతా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

నిబంధనలను అతిక్రమించ వద్దు

ప్రజాశక్తి - పెరవలి

వినాయక చవితి సందర్భంగా పోలీసు శాఖ కొన్ని నిబంధనలను ప్రవేశపెట్టిందని, ఆ నిబంధనలను అతిక్రమించకుండా ఉత్సవ కమిటీలు నడుచుకోవాలని ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ సూచించారు. మండలంలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఆదివారం ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో మండపాల వద్ద వినాయక ప్రతిమలు ప్రతిష్టించిన చోట ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా విగ్రహాలను ప్రతిష్టించుకోవాలని తెలిపారు. విద్యుత్ అలంకరణలో జాగ్రత్తలతోపాటు, తీన్మార్ డాన్సులు అతిక్రమించకూడదని అన్నారు. ప్రత్యార్థులపై తారాజువ్వలు వేయటం, ఇతరులను ఇబ్బంది కలగకుండా శబ్ద నియంత్రణ చర్యలను పాటించాలని తెలిపారు. ఊరేగింపు నిమజ్జనం రాత్రి వేళలో చేయరాదని, నిమజ్జన సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, మతపరమైన గొడవలు చేయరాదని సూచించారు.

సిఎం జగన్‌తోనే సంక్షేమం సాధ్యం

ప్రజాశక్తి - గోకవరం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సిఎం జగన్మోహన్ రెడ్డితోనే సంక్షేమ రాజ్యం సాధ్యమని మాజీ మంత్రి తోట నరసింహం అన్నారు. మండలంలోని గాదెలపాలెం గ్రామంలో వైసిపి నాయకులు తుమ్మలపల్లి గంగాధర్, గునిపే ఏడుకొండలు ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. 2024 లో మరొక్కమారు జగన్‌ని గెలిపించుకోవడానికి మనమందరం సైనికులుగా పనిచేయాలని అన్నారు. తోట రామ్‌జీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఆత్మీయ సమావేశాలకు ప్రజా స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. దాసరి చినబాబు, అత్తులూరి సాయిబాబా, తోట అయ్యన్న, షేక్ గఫుర్, రామకుర్తి మూర్తి, బదిరెడ్డి సుబ్బయ్యదొర, ఇజ్జిన కిరణ్ కుమార్, కురాకుల సుమంగళి, పత్తి రమేష్ పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో ముగ్గురు అరెస్టు

రూ.37.30 లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - అమలాపురం

దొంగతనాలు చేయడం. జైలుకు వెళ్లడమే వీరికి నిత్యకృత్యం. వివిధ దొంగతనాలు చేసిన ఒక ముఠాను పి.గన్నవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠాకు సంబంధించిన వివరాలను అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్‌పి ఎస్.శ్రీధర్ మీడియా సమావేశంలో వెల్లడించారు. నిందితులు పిల్లి సింహాచలం, ముల్కీ మారుతి శ్రీ సాయి రామ్, వలపశెట్టి వీరబాబు నుంచి రూ.37,30,000 సొత్తు స్వాధీనం చేసుకున్నామన్నారు. 32 కేసుల్లో వీరు నిందితులన్నారు. చెడు వ్యసనాలకు అలవాటు పడి రాత్రి సమయంలో తాళాలు వేసి ఉన్న గృహాల్లో దొంగతనంగా ప్రవేశించి ఇంటి తాళాలు, తలుపు గెడలు బద్దలు కొట్టి బీరువాల్లో ఉన్న వెండి, బంగారం వస్తువులను దొంగిలించి జల్సాలు చేయడం అలవాటుగా చేసుకున్నారని తెలిపారు. పలివెల వంతెన దగ్గరలో మెయిన్ రోడ్డు ప్రక్కన వారు అద్దెకు ఉంటున్న ఇంటి దగ్గర ఈ ముగ్గురిని పి.గన్నవరం సిఐ ప్రశాంత్, ఎస్ఐ హరికోట శాస్త్రి అరెస్ట్ చేశారని తెలిపారు. మొదటి ముద్దాయి పిల్లి సింహాచలంపై తిమ్మాపురం, పెద్దాపురం, పిఠాపురం, పాలకొల్లు, సర్పవరం, కోటవురట్ల పోలీస్ స్టేషన్ ఏరియాల్లో జరిగిన పలు దొంగతనాలపై కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. పలు కేసుల్లో ముద్దాయి అయిన సింహాచలం 2 సంవత్సరాల 8 నెలలు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండు ఖైదీగా ఉండి 2021 జూన్ నెలలో బెయిల్‌పై బయటకు వచ్చాడని వెల్లడించారు. తదనంతరంకోటవురట్ల పోలీసేస్టేషన్ కేసులో కోర్టు 2 సంవత్సరాలు జైలు శిక్ష విధించగా విశాఖపట్నం జైల్ నందు శిక్ష అనుభవించి బయటకి వచ్చాడని ఎస్‌పి తెలిపారు. రెండో నిందుతుడు ముల్కీ మారుతి శ్రీ సాయి రామ్‌పై కూడా సర్పవరం పోలీస్ స్టేషన్లో మోటార్ సైకిల్ దొంగతనం కేసు ఉందని, వీరు జైలు శిక్ష అనుభవించి ఆయా పరిధిలో రాత్రి తిరిగి వచ్చి మళ్ళీ దొంగతనాలు చేస్తూ ఆ తరువాత విలాసలు చేసే వారన్నారు. ఈ ముగ్గురు నిందుతుల నుంచి నుంచి 592.450 గ్రాముల బంగారం, దాని విలువ రూ. 33,00,000, 4 మోటార్ సైకిళ్ళు, 3 టివిలు, 1 కెమెరా, 1 కెమెరా ఫ్లాష్ లైట్, ఒక హోం థియేటర్, ఒక మ్యూజికల్ గిటార్ మొత్తం విలువ రూ. 4,30,000 ఉంటుందన్నారు. ముగ్గురు నిందుతుల నుంచి స్వాధీనం చేసుకున్న వాటి విలువ మొత్తం విలువ రూ.37,30,000 ఉంటుందని ఎస్‌పి శ్రీధర్ తెలిపారు. నేరస్తులను చాకచక్యంగా అరెస్టు చేసేందుకు సహకరించిన కొత్తపేట డిఎస్‌పి కెవి.రమణ, పి. గన్నవరం సిఐ డి.ప్రశాంత్‌కుమార్, గన్నవరం ఎస్ఐ హరికోటి శాస్త్రి, అమలాపురం క్రైమ్ ఇన్‌స్పెక్టర్ గోవిందరావు, అమలాపురం క్రైమ్ ఎస్ఐ సంపత్ కుమార్, ఎఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది శేఖర్ రాజు, నాగేశ్వరావు, శ్రీను, రమణ, ప్రసాద్, కష్ణసాయి, సుభాకర్, అర్జునరావు, ప్రసాద్, హరిబాబు, శ్రీను, సతీష్, చిరంజీవిలను ఎస్‌పి అభినందించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు : మంత్రి

ప్రజాశక్తి - చాగల్లు

రాష్ట్రంలో ప్రతీ ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకం అందుతుందని మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని దారవరంలో ఆదివారం సచివాలయ భవనం, హెల్త్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరత్నాల ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికి అమ్మ ఒడి, చేయూత, విద్యాదీవెన, జగనన్న విద్యా కానుక, జగనన్న చేదోడు, వివిధ రకాల పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్ ద్వారా ఇంటికి లబ్ధి చేకూరేలా కషి చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు ఏమి చేయకపోగా జన్మభూమి కమిటీల పేరుతో ఆఫీసుల చుట్టూ, నాయకుల చుట్టూ ప్రజలను తిప్పుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ప్రతిపక్షాలన్నీ కలిసి పొత్తు కుదుర్చుకునేందుకు నాన్న తంటాలు పడుతున్నాయని, మళ్లీ ఎన్నికలు వస్తున్న సందర్భంగా గ్రామాల్లోకి మాయమాటలు చెప్పేందుకు నాయకులు వస్తుంటారని తెలిపారు. గత ప్రభుత్వంలో తమ గ్రామాల్లో ఎటువంటి అభివద్ధి పనులు చేశారో ప్రతిపక్ష నాయకులను ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. సిఎం జగన్మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని తానేటి వనిత కోరారు. ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం సభాప్రాంగణం వద్ద సర్పంచ్ మద్దుకూరి రవిప్రసాద్ జన్మదిన వేడుకల్లో హోంమంత్రి తానేటి వనిత పాల్గొని రవిప్రసాద్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిత్యం ఆయురారోగ్యాలతో ఆనందంతో ఉండాలని.. ప్రజలకు మరింత సేవలు అందించాలని ఆమె ఆకాంక్షించారు.



అర్తమూరులో దిగిపోయిన సిసి రోడ్డు

అర్తమూరులో ప్రమాదకరంగా సిసి రోడ్డు

ప్రజాశక్తి-మండపేట

అర్తమూరులో సిసి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారాయి. గ్రామంలోని శ్మశాన వాటిక సమీపంలోని కాలువ వెంబడి ఉన్న సిసి రోడ్డు రెండు చోట్ల దిగిపోవడం, రామచంద్రపురం రోడ్డులోని తుపాకుల తూము వద్ద నుండి గ్రామంలోకి వచ్చే సిసి రోడ్డుకు గోతులు పడడంతో ఈ రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. దీంతో స్థానికులు, వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మధ్యకు విడిపోవడంతో రాత్రి సమయాల్లో ప్రజలు జారిపడుతున్నారని స్థానికులుచెబుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని వారు కోరుతున్నారు.



తాపేశ్వరం రోడ్డులో ఒరిగిన విద్యుత్ స్తంభం

పంట బోదెలోకి ఒరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ శివారు తాపేశ్వరం ప్రధాన రోడ్ లోని మెహర్ విద్యానికేతన్ సమీపంలో విద్యుత్ స్తంభం పంటబోదెలోకి ఒరిగిపోయింది. ఈ స్తంభానికి సపోర్ట్ గా వేసిన మరో స్తంభం విరిగిపోవడంతో పాటు పాదులు నిండుగా అలుము కున్నాయి. ఈ నేపథ్యంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా రోడ్డు గోతులమయంగా మారడంతో వాటిని తప్పించే ప్రయత్నంలోనే భారీ వాహనాలు దాటికి విద్యుత్ స్తంభం ఒరిగిపోతుందని పలువురు చెబుతున్నారు.ఇప్పటికైనా సంబంధం అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

డంపింగ్ యార్డులుగా రోడ్లు, కాలువ గట్లు

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛభారత్, స్వచ్ఛ సర్వేక్షణ్, మనం మన పరిశుభ్రత, వ్యర్థాలపై వ్యతిరేకపోరాటంతోపాటు పారిశుధ్యంపై అవగాహన వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మెరుగుపడటం లేదు. సమస్య నానాటికీ తీవ్ర రూపం దాలుస్తోంది. ఆహ్లాదకరంగా ఉండాల్సిన రహదారులు, కాలువ గట్లు డంపింగ్ యార్డులుగామారి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో తాము వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు, ప్రయాణీకులు వాపోతున్నారు. ఇవి కుక్కలకు, పందులకు, దోమలు.క్రిమికీటకాలకు ఆవాసాలుగా మారుతుండటంతో రాత్రి సమయాల్లో దోమలు కంటి మీదకునుకు లేకుండా చేస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు.ప్రభుత్వాలు, పాలకులు,



అర్తమూరు రోడ్డులో కాలువ చెంతనే పేరుకుపోయిన చెత్త

అధికారులు మారుతున్నా సమస్యల పరిష్కారానికి నోచుకోవడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. మూతపడ్డ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తెరిచి, చెత్తను అక్కడికి తరలించాలని కోరుతున్నారు. పచ్చదనం, పరిశుభ్రతను కాపాడే విధంగా అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సూర్యనగర్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-అమలాపురం

వైసిపి నాయకులు, తుని నియోజ కవర్గ ఎన్నికల పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు 51వ పుట్టినరోజు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆదివారం అమలాపురం సూర్యనగర్‌లో అభిమానులు రక్తదాన శిబిరాన్ని నిర్వహిం చారు. సుమారు 100 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో చెల్లుబోయిన శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ దంగేటి డోలమని రుద్ర, కౌన్సిలర్ డి.రాము, దొంగ చిన్న, కేతా భానుతేజ, రాజులపూడి మురళి, బండారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న దృశ్యం



పిచ్చి మొక్కలతో ఉన్న పార్క్

పార్కుల్లో కనీస సౌకర్యాలు కరువు

- 30వ వార్డులో పిచ్చి మొక్కలతో నిండిన పార్కు
- అభివృద్ధి చేయాలని కోరుతున్న ప్రజలు

ప్రజాశక్తి-మండపేట

పచ్చదనంతో కళకళలాడుతూ పట్టణ ప్రజలు సేద తీరేందుకు అనువుగా ఉండాల్సిన పార్కులు కనీస సౌకర్యాలు లేక నిరుపయోగంగా మారుతున్నాయి. పట్టణ పరిధిలోని 30వ వార్డులో ఉన్న రాజీవ్ గృహకల్ప కాలనీలో పార్కు పిచ్చి మొక్కలతో చిట్టి అడవిని తలపిస్తోంది. గత కొంతకాలంగా పార్కు ఈ విధంగానే ఉండి నిరుపయోగంగా మారుతుందని కాలనీ ప్రజలు అంటున్నారు.

కనీసం చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పార్కు అబివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.